క్లుప్తంగా

వెంకన్న ఆలయంలో ధనుర్మాస పూజలు



గోదాదేవికి హారతి ఇస్తున్న పురోహితులు

ఏయూ క్యాంపస్: ధనుర్మాసాన్ని పురస్కరించుకుని పెదవాల్తేరులోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గోదాదేవికి పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొని అర్చన చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలను పురోహితులు పంపిణీ చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: కైలాసగిరి ఫీడర్ పరిధిలో శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, విద్యుత్ మరమ్మతుల పనులు జరగనున్నాయి. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక, బీఎస్‌ఆర్ నగర్, తోటగరువు ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు ఏపీ ఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

శరవేగంగా శివాజీపాలెం రోడ్డు నిర్మాణం



వేగంగా జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

ఎంవీపీ కాలనీ: శివాజీపాలెం రోడ్డు నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. నగర సుందరీకరణలో భాగంగా ఇటీవల ఈ రోడ్డు నిర్మాణ పనులకు జీవీఎంసీ ఆధ్వర్యంలో శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ప్రస్తుతం నిర్మాణ పనులు జీవీఎంసీ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణానికి రూ.1.97 కోట్లు వెచ్చిస్తున్నారు. మరో రెండు రోజుల్లో నిర్మాణం పూర్తి కానున్నట్లు అధికారులు వెల్లడించారు.

శాస్త్రోక్తంగా చండీ హోమం



లలితా పీఠంలో చండీ హోమం నిర్వహిస్తున్న పండితులు

సీతంపేట: బహుళ అష్టమి సందర్భంగా గురువారం లలితానగర్ లలితా పీఠంలో వేద పండితులు శాస్త్రోక్తంగా చండీ హోమం నిర్వహించారు. పలువురు భక్తులు పాల్గొని భక్తిశ్రద్ధలతో హోమం ఆచరించారు. ఈ నెల 10వ తేదీ సాయంత్రం కాశీ కాలభైరవులకు అఘోర మృత్యుంజయ పాశుపత హోమం జరుగుతుందని పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు.

రైతుబజార్ స్టాళ్లకు డ్రా



రైతులకు స్టాల్ టోకెన్లు అందిస్తున్న ఈవో కొండబాబు

సీతమ్మధార: సీతమ్మధార రైతుబజార్‌లోని స్టాళ్లకు గురువారం ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు డ్రా తీసి రైతులకు టోకెన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ ఎవరికీ కేటాయించిన స్టాల్‌లో వారే వ్యాపారాలు నిర్వహించాలని సూచించారు.

వాడవాడలా పింఛన్ల పండగ



17వ వార్డులో వృద్ధులకు పెన్షన్లు అందజేస్తున్న కార్పొరేటర్ లావణ్య



6వ వార్డులో రూ.3వేలు పెన్షన్ అందిస్తున్న వైఎస్సార్‌సీపీ తూర్పు ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు

ఆరిలోవ: వైఎస్సార్ పెన్షన్ కానుక పెంపుతో తూర్పు నియోజకవర్గంలో వాడవాడలా పండగ వాతావరణం నెలకొంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ ప్రకారం అంచెలంచెలుగా పింఛన్ డబ్బులు పెంచుకుంటూ వచ్చారు. వృద్ధులు, వితంతువులకు ఈ నెల నుంచి రూ.3 వేలుకు పెంచి అందిస్తున్నారు. ఇందులో భాగంగా తూర్పు నియోజకవర్గంలో వలంటీర్లు గురువారం వృద్ధుల, వితంతువుల ఇళ్లకు వెళ్లి రూ.3 వేలు పింఛన్ అందించడంతో లబ్ధిదారులు మురిసిపోయారు. గత నెల వరకు రూ.2,750 అందుకున్న వారికి మరో రూ.250 అదనంగా పెంచి ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో అన్ని వార్డుల పరిధిలో ఆరిలోవ నుంచి విశాలాక్షినగర్, ఎంవీపీ కాలనీ, వెంకోజీపాలెం, మద్దిలపాలెం, జాలరిపేట, పెదవాల్తేరు, చినవాల్తేరు తదితర అన్నిచోట్ల గురువారం పింఛన్ల పంపిణీ ప్రక్రియ చేపట్టారు. ఈ పంపిణీ కార్యక్రమం ఈ నెల 8వ తేదీ వరకు జరగనుంది.

పెన్షన్ పెంపు చారిత్రాత్మకం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 17వ వార్డు ఆదర్శనగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ గేదెల లావణ్య ముఖ్యఅతిథిగా పాల్గొని వార్డులోని వృద్ధులు, దివ్యాంగులకు పెన్షన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి పెన్షన్‌ను రూ.3 వేలుకు పెంచడం చారిత్రాత్మకమన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి గేదెల నాగరాజు, పలువురు పార్టీ నాయకులు, వలంటీర్లు పాల్గొన్నారు.

16వ వార్డులో..

మద్దిలపాలెం : జీవీఎంసీ 16వ వార్డులో ఏపీఐఐసీ డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు మొల్లి అప్పారావు ముఖ్యఅతిథిగా లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పంపిణీ సందేశాన్ని లబ్ధిదారులకు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో కన్వీనరు శ్రీకాంత్, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

ఎంతో భరోసా..



ఈ నెల వలంటీర్లు మా ఇంటికి వచ్చి పింఛను డబ్బులు పెరిగాయంటూ రూ.3 వేలు చేతికి ఇచ్చారు. భర్తలేని నాలాంటి వారికి ఈ డబ్బులు ఎంతో భరోసా ఇస్తాయి. ఈ డబ్బులు అందుకున్నప్పుడు చాలా సంతోషమనిపించింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు.
– వాసుపల్లి గన్నమ్మ,వితంతువు, ఆరిలోవ కాలనీ,

మత్స్యకార పాఠశాల విలీనానికి వినతి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 19వ వార్డు వాసవానిపాలెంలోని మత్స్యకార పాఠశాలను రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ శాఖలో విలీనం చేయాలని తీరప్రాంత వాడబలిజ మత్స్యకారుల సంక్షేమ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సంఘం ప్రతినిధులు, మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ పేర్ల విజయ చందర్.. రాష్ట్ర మత్స్యకార శాఖ కమిషనర్ కె.కన్న బాబును అమరావతిలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మత్స్యకార శాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న స్కూల్‌గా వాసవానిపాలెంలోని మత్స్యకార పాఠశాలకు పేరొందన్నారు. ఈ స్కూల్.. రాష్ట్ర స్కూల్ ఎడ్యుకేషన్ పరిధిలో లేకపోవడంతో సౌకర్యాలతో పాటు ఉపాధ్యాయుల కొరత వేధిస్తోందన్నారు. ఈ నేపథ్యంలో ఈ పాఠశాలను విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ ఎడ్యుకేషన్ కమిషనర్ పరిధిలోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు పేర్ల భాస్కరరావు, మూగి శ్రీరామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

స్థానిక కళాకారులకు అవకాశమివ్వాలి



తెలుగుతల్లి విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న ఏపీ టీవీ ఆర్టిస్టులు

మద్దిలపాలెం : విశాఖలో జరుగుతున్న సినిమాల షూటింగ్‌లలో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించాలని కోరుతూ గురువారం మద్దిలపాలెం తెలుగుతల్లి విగ్రహం వద్ద ఏపీ ఫిల్మ్, అండ్ టీవీ ఆర్టిస్టుల యూనియన్ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ప్లకార్డులు ప్రదర్శించారు. యూనియన్ అధ్యక్షురాలు నాగేంద్రమ్మ మాట్లాడుతూ విశాఖ వేదికగా జరిగే ప్రతి షూటింగ్‌లో స్థానిక కళాకారులకు అవకాశాలు కల్పించి, ఉపాధి అందించాలని కోరారు.

రెడ్‌క్రాస్‌లో ఆశ్రయం పొందుతున్న వృద్ధుడి మృతి



నోచర్ల జోగారావు(ఫైల్)

ఎంవీపీ కాలనీ: కొంతకాలంగా 17వ వార్డులోని రెడ్‌క్రాస్ హోమ్‌లో ఆశ్రయం పొందుతున్న నోచర్ల జోగారావు(67) అనే వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందాడు. గతంలో అల్లిపురంలో నిరాశ్రయుడిగా ఉన్న ఈయన్ను గుర్తించి స్థానికులు, పోలీసులు 17వ వార్డులోని రెడ్ క్రాస్ హోమ్‌కు తరలించారు. దీంతో అప్పటి నుంచి జోగారావు ఇక్కడే ఆశ్రయం పొందుతున్నాడు. మానసిక పరిస్థితి బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యుల వివరాలు చెప్పలేకపోయాడు. దీంతో కొంతకాలంగా ఆశ్రయం నిర్వాహకులు అతని సంరక్షణ బాధ్యతను నిర్వర్తిస్తున్నారు. అయితే గురువారం మధ్యాహ్నం అతనికి ఆయాసం ఎక్కువగా వచ్చి ఊపిరి పీల్చుకోలేని పరిస్థితి ఉండటంతో కేజీహెచ్‌కు తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ సాయంత్రం మృతి చెందాడు. అతని కుటుంబ సభ్యుల వివరాలు తెలిసిన వారు వెంటనే రెడ్‌క్రాస్ ఆశ్రయానికి సమాచారం అందించాలని ఆ సంస్థ ప్రతినిధి మురళీ వెల్లడించారు. వివరాలు తెలిసిన వారు 63004 94020 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

బైకు చోరీ

మర్రిపాలెం: ఇంటి దగ్గర పార్క్‌చేసిన తన పల్సర్ బైకు పోయిందని ఓ వ్యక్తి కంచరపాలెం క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. ఇందిరానగర్-3లో నివసిస్తున్న వి.చందు ఓ ప్రైవేట్ బ్యాంకులో రిలేషన్‌షిప్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. డిసెంబర్ 21న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఎప్పటి లాగానే తన పల్సర్ బైకు(ఏపీ 39 ఎస్‌ఏ0840)ను కింద సర్వీస్ రోడ్డులో పార్క్‌చేసి పైన ఉన్న ఇంటికి వెళ్లారు. ఉదయం 9.30 గంటల ప్రాంతంలో ఆఫీస్‌కు వెళ్లేందుకు కిందకి వచ్చి చూసేసరికి బైకు కనిపించలేదు. దీంతో అంతటా వెతికారు. ప్రయోజనం లేకపోవడంతో గురువారం ఫిర్యాదు చేయడంతో కంచరపాలెం క్రైం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కృష్ణా కళాశాలతో 'ఎస్ ఇండియా' ఒప్పందం



ఎంవోయూ సభలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు

మద్దిలపాలెం : డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో ఎస్ ఇండియా రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ సెంటర్ గురువారం ఎంవోయూ చేసుకుంది. ఈ మేరకు ఇరువర్గాల ప్రతినిధులు ఒప్పందంపై సంతకాలు చేశారని కళాశాల ప్రిన్సిపాల్ ఐ.విజయబాబు తెలిపారు. పర్యావరణ, జీవ వైవిధ్యం, జీవ సాంకేతిక శాస్త్ర అనువర్తనాలు, ఆర్గానిక్ ఫార్మింగ్ తదితర అంశాలపై సంయుక్తంగా పరిశోధనలు చేయడానికి స్టూడెంట్ ఔట్ రీచ్ ప్రోగ్రామ్స్, ట్రైనింగ్ ప్రోగ్రామ్ సెమినార్లు, వర్క్‌షాప్‌లు నిర్వహించడానికి మార్గం సుగమమైందన్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఐఏఎస్ అధికారి డి.చక్రపాణి, హర డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హర శ్రీరాములు పాల్గొన్నారు.

జనం చెంతకే వైద్యం

- రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్షకు విశేష స్పందన
- మెరుగైన వైద్య సేవలపై సర్వత్రా హర్షం



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది



సురక్ష కేస్ షీట్ అందిస్తున్న పీతల గోవింద్

బీచ్ రోడ్డు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోంది. జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీ పార్క్ వద్ద గురువారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. వార్డులోని ప్రజలు తరలి వచ్చి తమ ఆరోగ్య సమస్యలను వైద్యులకు వివరించి పరీక్షలు చేయించుకున్నారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. అత్యాధునిక చికిత్స అవసరమైన వారికి పెద్ద ఆస్పత్రికి సిఫార్సు చేశారు.

503 మందికి వైద్య సేవలు

ఈ శిబిరంలో ఐదుగురు వైద్యులు పాల్గొని 503 మందికి వైద్య పరీక్షలు చేశారు. చిన్నారులు 14, గర్భిణులు 2, కంటి సమస్య 30 మంది, 457 మందికి సాధారణ వైద్య పరీక్షలు చేశారు. నలుగురికి కంటి వెలుగు కింద కళ్ల జోళ్లు అందజేశారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యం

ప్రజలందరికీ ఉచితంగా నాణ్యమైన వైద్యం అందించడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని పోలీసు హౌసింగ్ బోర్డు కార్పొరేషన్ డైరెక్టర్ పీతల గోవింద్ అన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఆరోగ్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

తరచూ జ్వరమొస్తుందని వచ్చా..



జ్వరం వస్తే చూపించుకునేందుకు కేజీహెచ్‌కు ఆటోపై వెళ్లాల్సి వచ్చేది. ఉదయం వెళ్తే వచ్చేసరికి సాయంత్రం అయ్యేది. ఇప్పుడు జగనన్న సురక్ష శిబిరంలో తరచూ ఎందుకు జ్వరం వస్తుందో చూపించుకున్నా. నా శరీరంపై చిన్న కాయ ఉంది. దీంతో వైద్యులు రక్త పరీక్షలు చేయించారు. మందులు కూడా ఉచితంగా అందజేశారు. నా భర్త కూడా వైద్య పరీక్షలు చేయించుకున్నారు.
– పి.పార్వతి, పిఠాపురం కాలనీ

తల నొప్పికి పరీక్షలు చేయించుకున్నా..



నాకు తలలో నరాల సమస్య ఉంది. దీంతో తరచూ తల నొప్పి వస్తూ ఉంటుంది. ప్రస్తుతం మందులు వాడుతున్నాను. గతంలో ఈ మందుల కోసం కేజీహెచ్‌కి వెళ్లాల్సి వచ్చేది. కానీ ఇప్పుడు ఇంటి వద్దనే మందులు అందుబాటులోకి వచ్చాయి. మొదటి విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో తీసుకున్న మందులు ఇప్పటి వరకు వచ్చాయి. మళ్లీ ఇప్పుడు తీసుకున్నా. సమయం, డబ్బు ఆదా అయింది.
– రమణమ్మ, మద్దిలపాలెం

7న ఉచిత ఆయుర్వేద శిబిరం

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం యోగా కేంద్రం ఆధ్వర్యంలో ఈ నెల 7న బీచ్ రోడ్డులోని యోగా విలేజ్‌లో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్టు కేంద్రం సంచాలకుడు ఆచార్య ఓ.ఎస్.ఆర్.యు.భానుకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి 12 గంటల వరకు పైల్స్, ఫిస్టుల తదితర సమస్యలపై చికిత్స అందించనున్నట్టు పేర్కొన్నారు. కేజీహెచ్ విశ్రాంత సీనియర్ మెడికల్ అధికారి డాక్టర్ కె.ఈశ్వరరావు స్వయంగా రోగులను పరీక్షించి తగిన చికిత్స విధానాలు సూచిస్తారన్నారు. రోగులు తమ వైద్య పరీక్షలకు సంబంధించిన రిపోర్టులు తీసుకుని రావాలని సూచించారు. ఇతర వివరాలకు 94401 91673 నంబరులో సంప్రదించాలన్నారు.

న్యాయశాస్త్రంలో లక్ష్మీచరణ్‌కు డాక్టరేట్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ కళాశాల పరిశోధక విద్యార్థిని జె.లక్ష్మీచరణ్‌కు డాక్టరేట్ లభించింది. న్యాయ కళాశాల ఆచార్యులు కె.సీతామాణిక్యం పర్యవేక్షణలో ఏ స్టడీ ఆన్ ఎఫెక్టివ్ ఇంప్లిమెంటేషన్ ఆఫ్ రేప్ లాస్ ఇన్ ఇండియా విత్ రిఫరెన్స్ టు మెడికల్ అండ్ ఫోరెన్సిక్ ఏస్పెక్ట్స్–ఇష్యూస్ అండ్ చాలెంజెస్ అంశంపై జరిపిన పరిశోధనకు ఆమెకు డాక్టరేట్ వచ్చింది. ఈ మేరకు ఏయూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య కె.సమత నుంచి డాక్టరేట్ ఉత్తర్వులను లక్ష్మీచరణ్ స్వీకరించారు. తన పరిశోధనలో భాగంగా లక్ష్మీచరణ్ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించిన 100 లైంగిక దాడులకు సంబంధించిన కేసులను అధ్యయనం చేశారు. ప్రాథమిక దశలో సాక్ష్యాలను సేకరించడం, వైద్యుల నివేదికలు, ఫోరెన్సిక్ నిపుణుల నివేదికలు తీర్పులను ప్రభావితం చేసిన విధానాలను అధ్యయనం చేశారు. రేప్ చేసిన వారికి శిక్షలు పడటానికి వైద్యుల నివేదికలు, ఫోరెన్సిక్ రిపోర్టులు ఎంత ప్రభావవంతంగా పని చేస్తాయి, వైద్యులు నివేదికలు ఇచ్చే సమయంలో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలని అనే అంశాలను తన పరిశోధనలో వివరించారు.

మిద్దె పంటలపై అవగాహన



మిద్దె పంటలపై అవగాహన కల్పిస్తున్న జీవీఎంసీ యూసీడీ ఏపీడీ లక్ష్మి

ఎంవీపీ కాలనీ: నగర వాసులు మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి సారించి ఎకో వైజాగ్‌ను విజయవంతం చేయాలని జీవీఎంసీ యూసీడీ ఏపీడీ లక్ష్మి కోరారు. అర్బన్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో గురువారం మన కూరగాయల తోట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మిద్దె పంటలపై అవగాహన కల్పించడంతో పాటు గ్రీన్ క్లైమేట్ ఎన్జీవో సంస్థ సమకూర్చిన కూరగాయల మొక్కలను ఆమె పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ ప్రకృతి ఆధారిత పంటలను ఆహారంగా తీసుకోవడం ఆరోగ్యకరమన్నారు. ఈ దిశగా నగర వాసులు మిద్దె పంటలు, పెరటి పంటలపై దృష్టిసారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్జీవో కార్యదర్శి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

కథా నాటిక పోటీలు ప్రారంభం



ప్రసంగిస్తున్న ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రవికృష్ణ



శిథిల జీవి నాటికలో ఓ సన్నివేశం

మద్దిలపాలెం : అజో–విభో–కందాళం, రైటర్స్ అకాడమీ సంయుక్తంగా మద్దిలపాలెం కళాభారతి వేదికగా నిర్వహిస్తున్న కథా నాటిక పోటీలు గురువారం ప్రారంభమయ్యాయి. తొలి రోజు కార్యక్రమానికి ఆహ్వాన సంఘం కన్వీనర్ డాక్టర్ డి.ఎస్.ఎన్.మూర్తి స్వాగత ఉపన్యాసంతో శ్రీకారం చుట్టారు. అనంతరం ఆత్మీయ అతిథి నంద్యాలకు చెందిన కళారాధన సంస్కృతిక సంస్థ, ఏపీ ఇండియన్ మెడికల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ జి.వి.రవికృష్ణ మాట్లాడుతూ కథలను నాటకాలుగా మార్చడంలో కంధాల ఫౌండేషన్ చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. కథలు, నాటకాలు పుస్తకాల రూపంలో తీసుకువచ్చిన సంస్థలను ఆయన అభినందించారు. చాలా ఏళ్ల క్రితం తాను రాసిన మాధవ సేవ కథను నాటిక పోటీలలో ప్రదర్శించడానికి అవకాశం కల్పించిన నిర్వాహకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. రైటర్స్ అకాడమీ చైర్మన్ వి.వి.రమణమూర్తి మాట్లాడుతూ నాటకాలను ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుంటామన్నారు. సినీనటుడు మిశ్రో మాట్లాడుతూ అహో ఆంధ్ర బోజా అన్నట్టుగా అజో- విబో-కందాళం పేరు ఉందన్నారు. రంగస్థల నటి అలపాటి లక్ష్మి మాట్లాడుతూ తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఉట్టి పడేలా కళాకారులు ప్రదర్శిస్తున్నారన్నారు.

ఆకట్టుకున్న శిథిల జీవి నాటిక

నాటిక పోటీలలో తొలి ప్రదర్శనగా శిథిల జీవి నాటిక ప్రేక్షకుల హృదయాలను కదిలించింది. పల్లెలో ఓ పేద కుటుంబం జీవన తీరును కళాకారులు కళ్లకు కట్టినట్టుగా ప్రదర్శించి ప్రశంసలు పొందారు. అనంతరం ప్రముఖ రంగస్థల నటి ఆలపాటి లక్ష్మికి రంగస్థల సేవా మూర్తి జీవితకాల సాధన పురస్కారంతో పాటు రూ.10 వేలు నగదు అందించి సత్కరించారు.

నేడు ఉపాధి కార్యాలయంలో జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో శుక్రవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారులు సిహెచ్.సుబ్బిరెడ్డి(క్లరికల్), శాంతి(టెక్నికల్) ఒక ప్రకటనలో తెలిపారు. వేదాంత గ్లోబల్ కార్పొరేషన్, స్లైడ్ కార్పొరేషన్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, ముత్తూట్ ఫైనాన్స్, ఆర్‌ఏఎస్ టెక్నాలజీస్, వీల్స్ మార్ట్, ఈ జోన్ సెక్యూరిటీ సొల్యూషన్స్, యాష్ స్టోర్స్, హెటిరో డ్రగ్స్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 415 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. సాఫ్ట్‌వేర్ డెవలపర్స్, కౌంటర్ క్యాషియర్, బ్రాంచ్ ఇన్‌చార్జ్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, సీనియర్ అండ్ జూనియర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, జూనియర్ కెమిస్ట్, పోర్ట్ సర్వేయర్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మాసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లొమో, ఏదైనా డిగ్రీ, పీజీల్లో ఉత్తీర్ణత సాధించిన 18–32 ఏళ్ల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని చెప్పారు. ఆయా ఉద్యోగాలను బట్టి జీతం నెలకు రూ.16,000 నుంచి రూ.25,000 వరకు ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే జాబ్‌మేళాకు హాజరు కావాలని కోరారు.

బుల్లయ్య కళాశాలలో సైన్స్ ఫెస్ట్



విద్యార్థుల సైన్స్ నమూనాను పరిశీలిస్తున్న సెక్రటరీ కరస్పాండెంట్ మధుకుమార్

సీతంపేట: డాక్టర్ లంకపల్లి బుల్లయ్య కళాశాల స్వర్ణోత్సవం సందర్భంగా డిగ్రీ, పీజీ విద్యార్థులు గురువారం నిర్వహించిన సైన్స్ ఫెస్ట్ విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు ప్రదర్శించిన సాంకేతిక ప్రదర్శనలు, నమూనాలు వారి ప్రతిభకు అద్దం పట్టాయి. వివిధ కళాశాలలు, పాఠశాలల విద్యార్థులను ఆహ్వానించి వారు తయారు చేసిన నమూనాల్లో ఇమిడి ఉన్న సాంకేతికత, ప్రయోజనాలను, మానవ జీవితానికి ఏ విధంగా ఉపయోగపడతాయో వివరించారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్, బి.మాధవి, బ్రహ్మానందరెడ్డి సైన్స్ నమూనాలకు తిలకించి విద్యార్థులను అభినందించారు.

రోడ్డు ప్రమాదాల కట్టడికి చర్యలు

- ప్రధాన జంక్షన్లలో మైక్ సిస్టం ఏర్పాటు
- ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్



ఎన్‌ఏడీ సెంటర్‌లో మైక్ సిస్టం ద్వారా మాట్లాడుతున్న ఏసీపీ రాజీవ్‌కుమార్

విశాఖ విద్య: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపడుతున్నట్లు ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్‌కుమార్ తెలిపారు. ఎన్‌ఏడీ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పబ్లిక్ అడ్రస్ సిస్టం మైక్ సెట్‌ను గురువారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. జాతీయ రహదారిపై ఎన్‌ఏడీ, బిర్లా, తాటిచెట్లపాలెం ముఖ్య జంక్షన్లలో కంచరపాలెం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్(మైక్ సెట్) ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వీటి ద్వారా ప్రజలకు, ప్రయాణికులకు, వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించేలా చర్యలు చేపట్టామన్నారు. ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు మైక్ సెట్‌ను ఏర్పాటు చేశామన్నారు. హర్ష హీరో సంస్థ, పాత్ర ఇండియా కంపెనీ, హుందాయి కార్ల కంపెనీ వారి సౌజన్యంతో ఈ మైక్ సెట్‌లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రోడ్డు ప్రమాదాల కట్టడి, వాహనదారుల్లో చైతన్యం కలిగించేలా వీటి ఏర్పాటుకు సహకరించిన సంస్థల ప్రతినిధులను ఏసీపీ అభినందించారు. కార్యక్రమంలో కంచరపాలెం ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు, ప్రతినిధులు పాల్గొన్నారు.